ప్రజాశక్తి
మంగళవారం 16 జులై 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఎయు ప్రొఫెసర్లు, ఉద్యోగులు, సిబ్బందికి..

ఆగస్టు వరకూ జీతాలు లేనట్టే..!

- ప్రసాదరెడ్డి రాజీనామాకు నేటికీ లభించని ఆమోదం
- కొత్త నియామకంపై తొలగని ప్రతిష్టంభన



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ ఏడాది జూన్ నెలకు సంబంధించిన జీతాలు ఎయు ప్రొఫెసర్లు, ఉద్యోగులు, సిబ్బందికి నేటికీ అందలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం ఈ సమస్యను తక్షణం పరిష్కరిస్తుందని ఎదురు చూసిన వారందరికీ నిరాశే మిగిలింది. ఎయుకు ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ అయినా వచ్చి జీతాల ఫైలుపై సంతకం చేస్తేగానీ వేతనాలు విడుదల కావు. ఈ ప్రతిష్టంభన ఆగస్టు వరకూ కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎయు విసిగా బాధ్యతల్లో ఉండి గత నెల 28న రాజీనామా చేసిన పివిజిడి.ప్రసాదరెడ్డిపై రాష్ట్ర ప్రభుత్వం సిబిసిఐడి విచారణ, అలాగే విజిలెన్స్ విచారణ కోరింది. దీంతో గవర్నర్ దీనిపై న్యాయపరమైన సలహాలతో ముందుకెళ్లాలని భావిస్తున్నట్లు ఎయులోని అధ్యాపకుల్లో తాజాగా చర్చ జరుగుతోంది. విజిలెన్స్ విచారణ అక్రమాలపై చేసేటప్పుడు సదరు వ్యక్తి కూడా సీటులో ఉండాలన్న నిబంధన ఉండడంతో సాంకేతికంగా ఆ విచారణ జరగదని తెలుస్తోంది. వైస్‌ఛాన్సలర్ రాజీనామాను ఆమోదిస్తేనే కొత్తవారి నియామకంపై ప్రభుత్వం కసరత్తు చేసి గవర్నర్ ఆమోదానికి ఇవ్వనుంది. అయితే రాష్ట్రంలో రాయలసీమకు చెందిన రెండు యూనివర్శిటీల వైస్ ఛాన్సలర్లు తమను రాజకీయంగా ఒత్తిడి చేసి బెదిరించి రాజీనామాలు చేయించారని గవర్నర్‌కు లేఖలు రాసినట్లు తెలుస్తోంది. ఈ విషయమై గవర్నర్ పరిశీలన చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఎయు విసి నియామక వ్యవహారంలో జాప్యం జరుగుతున్నట్టు తెలుస్తోంది.

విసి కోసం వేట

ఎయు విసి కోసం రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్వేషణ కొనసాగిస్తోంది. కమ్మ సామాజిక తరగతి నుంచి కొంతమంది పేర్లు వినిపిస్తున్నా కూటమి లోని జనసేన అధినేత అంగీకరిస్తారా ? అన్న చర్చ కూడా సాగుతోంది. కాపు సామాజిక తరగతికి కేటాయించినా సమస్య తలెత్తే అవకాశముందని పలువురు చెబుతున్నారు. ఎయు ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన ప్రిన్సిపల్ పేరును విసిగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పై రెండు సామాజిక తరగతులకు చెందని ప్రొఫెసర్. శశిభూషణరావు పేరునూ పరిశీలన చేస్తున్నట్లు భోగట్టా. అంతేగాక బ్రాహ్మణ సామాజిక తరగతికి చెందిన సీనియర్ అధ్యాపకులు, బయోడేటా బాగుండే ఒక వ్యక్తి పేరును కూడా ప్రభుత్వం సీరియస్‌గా పరిగణలోకి తీసుకున్నట్లు చర్చ సాగుతోంది. ఏదిఏమైనా గవర్నర్ ఆమోదం వచ్చాక విసి నియామకం జరిగితేనే ఎయు అధ్యాపక, ఉద్యోగ, సిబ్బందికి జీతాలు అందనున్నాయి.



మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యప్రసాద్

కెజిహెచ్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 179 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన కెజిహెచ్‌ను ప్రపంచానికే ఆదర్శంగా తీర్చిదాద్దాలని, ఆ దిశగా అందరూ సమిష్టి కృషి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై.సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. వైద్యులు సేవా దృక్పథంతో మెలగాలన్నారు. సోమవారం సాయంత్రం కెజిహెచ్ సమావేశ మందిరంలో వైద్యాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామ స్థాయిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ప్రజలకు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రైవేట్ ఆసుపత్రుల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని, ఆ భావన వారిలో పోయి ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, ఆధునిక పరికరాలు, సరైన సిబ్బంది లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని, వాటిని అధిగమించి ముందుకు సాగాలన్నారు. రాష్ట్రంలో కొత్తగా 12 వైద్య కళాశాలలు వస్తున్నాయని, అందుకు అవసరమైన మ్యాచింగ్ గ్రాంట్ నిధుల సమీకరణ కోసం ఆలోచన చేస్తున్నామని తెలిపారు. నాణ్యమైన వైద్య విద్య అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కేవలం ప్రభుత్వ నిధుల కోసం వేచి ఉండక మిగతా 2లో..

బీమా రంగ సమస్యలపై మాట్లాడతా

వార్త 2లో..

గాజువాకలో వ్యక్తి దారుణ హత్య

వార్త 3లో..

నగరంలో పేకమేడలు సినిమా యూనిట్ సందడి

వార్త 2లో..

జిల్లా ప్రగతే లక్ష్యం

శాఖల వారీ సమీక్షలో విశాఖ కలెక్టర్ హరీంద్ర ప్రసాద్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరీంద్ర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న సమస్యలను అధిగమించి, ప్రగతి సాధించాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరీంద్ర ప్రసాద్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతి, పెండింగ్ సమస్యల పరిష్కారంతో పాటు కారుణ్య నియామకాలపై సోమవారం ఆయన తన సమావేశ మందిరంలో శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో కొన్నిచోట్ల తాగునీరు, మురుగునీటి సమస్య ఉందని తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సోషల్ వెల్ఫేర్ డిడిని ఆదేశించారు. నిత్యావసర సరుకులను సకాలంలో విడిపించి, మండల స్థాయి నిల్వ కేంద్రాల్లో ఉంచాలని, రిజిస్టర్ ప్రకారం అన్నీ సక్రమంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించి పంపిణీ చేయాలని జిల్లా సరఫరా అధికారికి సూచించారు. పిఎమ్ విశ్వకర్మ యోజన మిగతా 2లో..

17న విశాఖ ఉక్కుపై సదస్సు

స్టీల్ మాజీ సిఎమ్‌డి శివసాగరరావు, సిఐటియు జాతీయ నేత తపన్‌సేన్ సహా పలువురు ప్రముఖులు హాజరు



ఉక్కునగరంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఉక్కునగరం : ఈ నెల 17న 'సంక్షోభంలో విశాఖ ఉక్కు - అధిగమించడం ఎలా' అన్న అంశంపై సదస్సు నిర్వహించనున్నట్టు స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు తెలిపారు. ఉక్కునగరంలోని సంఘం కార్యాలయంలో ఆ రోజు సాయంత్రం 5.30 గంటల నుంచి జరిగే ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సదస్సు పోస్టర్‌ను స్టీల్‌ప్లాంట్‌లోని స్టోర్ జంక్షన్ వద్ద వారు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యలపై నిష్ణాతులతో కార్మికులలో అవగాహన, చైతన్యం కలిగించి, సరైన పోరాటాలను నిర్మిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు ఎదురైన సంక్షోభాలను ఎదుర్కోవడంలో స్టీల్ సిఐటియు ప్రధాన భూమిక పోషించిన విషయాన్ని గుర్తుచేశారు. ఉక్కుపై చైతన్యంతో కూడిన పోరాటాలు చేస్తేనే విజయం సాధ్యమన్నారు. గడిచిన కొంత కాలంగా స్టీల్‌ప్లాంట్‌కు మైన్స్ కేటాయించాలని పాదయాత్రలు, రక్తదానం తదితర కార్యక్రమాల ద్వారా చైతన్యం కలిగించామన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కెజిహెచ్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

దాతల సహకారంతో కొన్ని పనులు పూర్తిచేసుకునేలా ప్రణాళికలు రచించాలన్నారు. విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ కెజిహెచ్‌లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇకపై ఆసుపత్రిలో నిర్మాణాలు చేపడితే రానున్న 50 ఏళ్లను దృష్టిలో ఉంచుకొని జి ప్లస్ 20 తరహాలో నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య కాస్త పెరిగినప్పటికీ ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఆసుపత్రికి ఆ సంఖ్య మరింత పెరగాల్సి ఉందని సూచించారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధ్ర ప్రసాద్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర నుంచే కాకుండా ఒడిశా నుంచి వచ్చే రోగులకు కూడా వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, ఉత్తర శాసనసభ్యులు పి.విష్ణుకుమార్ రాజు, ఎస్.కోట శాసనసభ్యులు కె.లలిత కుమారి, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఎఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు, పి.గోవిందరావు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

17న విశాఖ ఉక్కుపై సదస్సు

17న జరిగే సదస్సుకు ముఖ్య వక్తలుగా స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి శివసాగర్‌రావు, సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వివి.లక్ష్మీనారాయణ, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు హాజరుకానున్నట్టు వెల్లడించారు. నేడు స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వారు సూచించే మార్గాలపై కార్మికులు అవగాహన పెంచుకుని సమర్ధవంతమైన పోరాటాలకు సిద్ధంకావాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పి.శ్రీనివాసరాజు, కె.గంగాధర్, నీలకంఠం, కృష్ణమూర్తి, టివికె.రాజు, శంకరరావు, శ్రీనివాస్ రెడ్డి, వి.మురళి, డిఎస్‌విఎస్.శ్రీనివాస్, దుర్గాప్రసాద్, ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

జిల్లా ప్రగతే లక్ష్యం

పథకానికి భారీగా దరఖాస్తులు వస్తున్న నేపథ్యంలో వాటిని క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అంశంపై మాట్లాడుతూ తగిన చర్యలు చేపట్టాలని ఇపిడిసిఎల్ ఎస్ఇని ఆదేశించారు. టిడ్కో గృహ సముదాయాల్లో రహదారులు, విద్యుత్, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

ఖాళీల వివరాలు అందజేయండి

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను తక్షణమే అందజేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కారుణ్య నియామకాల కోసం సుమారు 80 వరకు దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని భర్తీ చేసేందుకు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను నిర్దిష్ట పట్టిక ద్వారా తెలియజేయాలన్నారు. సమావేశంలో జివిఎంసి అదనపు కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్‌డిఒ డి.హుస్సేన్ సాహెబ్, జివిఎంసి, పోలీస్ అధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా బోధించొచ్చు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఒత్తిడి లేకుండా సునాయాసంగా బోధించవచ్చని పలువురు వక్తలు సూచించారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, ఆంధ్రప్రదేశ్ చిల్డ్రన్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో కంచరపాలెంలోని బిఎన్ఆర్. ఫౌండేషన్‌లో ట్యూషన్ కేంద్రాల నిర్వాహకుల ప్రాంతీయ శిక్షణా శిబిరం రెండు రోజులపాటు జరిగింది. ఒత్తిడి లేకుండా సునాయాసంగా ఎలా బోధించవచ్చు అన్న విషయాన్ని స్టేట్ రిసోర్స్‌పర్సన్ డాక్టర్ అనంతలక్ష్మి తెలియజేశారు. ప్రముఖ కార్టూనిస్ట్ జి.హరి వెంకట్ పిల్లలకు కార్టూన్ల ద్వారా, కథల ద్వారా ఎంత కష్టమైన అంశాన్ని అయినా ఎలా సులువుగా నేర్పించవచ్చో వివరించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో విద్య కోసం, ముఖ్యంగా ట్యూషన్ సెంటర్ల నిర్వహణ కోసం సహకారం అందిస్తున్న విశ్వ మానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు మస్తాన్‌రావు మాట్లాడుతూ సమాజం బాగుంటే పిల్లలు బాగుంటారన్నారు. పిల్లల్లో విలువల పెంపుదలకు ట్యూషన్ సెంటర్లు దోహదపడాలన్నారు. షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్, ట్యూషన్ సెంటర్ నిర్వాహకులు ఎల్లాజీ మాట్లాడుతూ ట్యూషన్ సెంటర్ల నిర్వహణ, విధి విధానాలు వివరించారు. ఆంధ్రప్రదేశ్ చిల్డ్రన్స్ క్లబ్స్ కన్వీనర్ డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ వీక్లీ, మంత్లీ, ఏన్యువల్ మాడ్యూల్స్ ఎలా తయారు చేయాలి, ప్రణాళికలు ఎలా సిద్ధం చేసుకోవాలి అన్న విషయాలను తెలియజేశారు. శిక్షణ శిబిరంలో పాల్గొన్న వారంతా సంతృప్తి వ్యక్తం చేశారు. తాము నేర్చుకున్న అంశాలను అమలుచేయడం కోసం ప్రయత్నిస్తామన్నారు.



బోధనా పద్ధతులను వివరిస్తున్న వక్త

పాస్‌పోర్ట్ పోయినది

నేను **మల్లేశ్వర జోగారావు, తండ్రి మల్లేశ్వరతాతారావును** గాజువాక నుండి దువ్వాడ ఆటోలో వెళ్ళుతుండగా నా పాస్‌పోర్ట్ ఉన్న బ్యాగ్ పోయినది. **నా పాస్‌పోర్ట్ నెం. Y5203180** దొరికిన వారు దయచేసి ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

మల్లేశ్వర జోగారావు
డో.నెం.13-18-1/2, సంజీవిగిరికాలనీ,
బి.సి.రోడ్, గాజువాక, విశాఖపట్నం-26
సెల్ : 9030342231

బీమా రంగ సమస్యలపై మాట్లాడతా

విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రానున్న కేంద్ర బడ్జెట్ సమావేశాలలో బీమా రంగం ఎదుర్కొంటున్న సమస్యలపైనా, ఆ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల డిమాండ్లపైనా తాను మాట్లాడతానని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీ భరత్ హామీ ఇచ్చారు. సోమవారం ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, ఎల్ఐసి వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ జి.సూర్యప్రభ, ఐసిఇయు నాయకులు సతీష్, గోవింద్, శ్రీనివాసరావు, ఎవిఆర్‌కె.మూర్తి ఎంపీ శ్రీభరత్‌ను కలిసి బీమా పరిశ్రమకు సంబంధించిన సమస్యలపై వినతి పత్రం సమర్పించారు.

ఇన్సూరెన్స్ రంగంలో ఎఫ్‌డిఐ పెంపును విరమించి, బీమా ప్రీమియంపై జిఎస్‌టి ఎత్తివేసేలా ప్రభుత్వంతో చర్చించి ఆ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో యూనియన్ మీడియా ఇన్‌ఛార్జ్ ఎ.రామ కృష్ణారావు పాల్గొన్నారు.



శ్రీభరత్‌ను కలిసిన ఎల్ఐసి యూనియన్ నాయకులు

నగరంలో పేకమేడలు సినిమా యూనిట్ సందడి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలో పేక మేడలు సినిమా యూనిట్ సందడి చేసింది. క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్ బ్యానర్‌పై నా పేరు శివ ఫేమ్ వినోద్ కిషన్ హీరోగా, అనూష కృష్ణ హీరోయిన్‌గా నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో, రాకేష్ వర్రే నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న పేకమేడలు చిత్రం ప్రమోషన్‌లో భాగంగా సోమవారం డాబాగార్డెన్స్ వద్దగల 7 లాంప్ హోటల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. హీరో వినోద్ కిషన్ మాట్లాడుతూ పేక మేడలు సినిమా ఈ నెల 19న విడుదల అవుతుందన్నారు. స్మారన్ మంచి సంగీతం అందించారన్నారు.

సినిమా బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగా ఇచ్చారన్నారు. తనకు హీరోగా ఇది తొలి సినిమా అని, తప్పకుండా విజయవంతం అవుతుందని అన్నారు. మధ్య తరగతి కుటుంబం నేపథ్యంలో తీసిన, అందరికీ నచ్చే సినిమా ఇదని అన్నారు. ఇందులో హీరో పాత్ర పరిస్థితులను బట్టి ఊసరవెల్లి మాదిరిగా మారుతుందని చమత్కరించారు. హీరోయిన్ అనూష కృష్ణ మాట్లాడుతూ తనకు తెలుగులో ఇది తొలి సినిమా అన్నారు. గతంలో కన్నడ సినిమాలు చేశానన్నారు. నిర్మాత రాకేష్ వర్రె మాట్లాడుతూ సినిమా ప్రమోషన్ కోసం విశాఖ రావడం ఇదే తొలిసారి అన్నారు.తాను గతంలో బాహుబలి, మిర్చి సినిమాల్లో నటించానని గుర్తు చేశారు. చిత్రం ట్రైలర్‌కి ఇప్పటికే మంచి ఆదరణ వచ్చిందని తెలిపారు.

ఆటో డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆటో డ్రైవర్ల జీవన భృతికి గండి కొట్టే ఓలా, ఉబర్, రాపిడ్ సర్వీసులను వెంటనే నిలిపివేయాలని విశాఖపట్నం జిల్లా ఆటో కార్మిక సంఘం (ఎఐటియుసి) జిల్లా అధ్యక్షులు షేక్ రహిమాన్, ప్రధాన కార్యదర్శి సిహెచ్.కాసుబాబు డిమాండ్ చేశారు. సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఈ మేరకు సంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు, అధ్యక్షులు ఎం.మన్మధరావు, సిహెచ్.సాయికుమార్, పోల్‌రెడ్డి, దుర్గ, శివ, రమణ, పాల్గొన్నారు.

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.P. 5/2023

Between :
గేదెల రాము S/o లేటు బుచ్చియ్య, Ex. Employee in Jute Mill, గెద్దవీధి, తోటపాలెం, విజయనగరం.
......పిటిషనరు
And:
పులగం లక్ష్మీ వగైరాలు ....రెస్పాండెంట్లు

నోటీసు

R3. నల్లమిల్లి గౌతమి భర్త శివారెడ్డి, డోరు నెం. 1-82, దేవాంగులవీధి, రామవరం, అనపర్తి మండలం, తూర్పుగోదావరి జిల్లా.
R5. మాదేవ పైడిరాజు తండ్రి రాము, R/o గెడ్డవీధి, తోటపాలెం, విజయనగరం.
R7. పతివాడ లక్ష్మి, భర్త జగన్, మూడుకోవెళ్ళు దగ్గర, డ్రైవర్స్‌కోలనీ, కొమ్మాది జంక్షన్, విశాఖపట్నం.

ఇందలి పిటిషనరు పులగం లక్ష్మితో పాటు మీపైన తనను ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని పై కోర్టులో పిటిషన్‌ను దాఖలు చేసియున్నారు. ఇందులో మీకు నోటీసు నిమిత్తం పలు పర్యాయములు బెటా చెల్లించినప్పటికీ అవి అమలు జరుగలేదు. అందుకు ఈ పేపరు ప్రకటన ద్వారా **తే 26-7-2024దీన ఉదయం 10-30 గంటల**కు పై కోర్టు ఎదుట మీరు గాని, మీ తరుపు లాయరు ద్వారా హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు దాఖలు చేయవలెను. అట్లు కానిచో కోర్టులో వున్న ఆధారాల మేరకు మీకు పరోక్షంగా తీర్పు చెప్పబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

//బై కోర్టు ఆర్డర్//

పి.ధనుంజయ రావు
పిటిషనరు తరుపు న్యాయవాది,
విజయనగరం, సెల్ : 9440711430

IN THE COURT OF THE HON'BLE XII ADDL. DISTRICT JUDGE, RANGAREDDY DISTRICT AT: L.B.NAGAR
OS. NO. 1336 OF 2017.

BETWEEN:
M/s Telangana Nayee Brahmana Seva Sangam
..Petitioner/Plaintiff.
AND
K. Ilaiah & 19 others
...Respondents/Defendants

To, 1) Smt M.Surya Kumari w/o M. Narendra kumar, Aged about 36 year, occ: House hold, R/o H.No 43-19-17/1, T.S.N Colony, V.R.Nagar, Visakhapatnam urban, Visakhapatnam-A.P.530016. c/o A. Raghuma Reddy s/o A. Mohan Reddy, Aged about 31 year, Occ: Business, R/o h.No 1-36, Nadhar gul Village, Balapur Mandal, R.R. District. 501510.
...Defendant No. 16

2) K.Prashanth S/o. K.Chandrashar Babu, Aged about 29 year, Occ: Soft were Engineer, R/o H.No 12-107/1, Azzad Raod, Madhira, Kammam District. C/o A. Raghuma Reddy s/o A. Mohan Reddy, Aged about 31 year, Occ: Business, R/o h.No 1-36, Nadhar gul Village, Balapur Mandal, R.R. District. 501510.
... Defendant No. 17

Please take notice that, my client i.e., Plaintiff M/s. Telangana Nayee Brahmana Seva Sangam has filed a suit No **OS No.1336 of 2017,** before the Hon'ble XII Additional District Judge, R.R District at L.B Nagar, seeking declaration and perpetual injunction in respect of suit schedule of properties i.e., to the extent of AC.0-22 guntas, in survey no. 733, situated at Nadergul village, Saroornagar Revenue Mandal Rangareddy District against Defendants No. 1 to 20 among them you both are placed as Defendant no. 16 and 17 in the said suit, As you all created sham documents to deprive the right of my client. The above said Hon'ble court i.e., XII th Additional District Judge, R.R District at L.B Nagar was pleased to post the suit for hearing on 26-7- 2024. As per the direction of the above said court you are hereby summoned to appear before the Hon'ble XII th Additional District Judge, R.R District at L.B Nagar on **26-7-2024** at **10.30** AM, your appearance either personally or through your advocates. Failing which the matter will be heard exparte in O.S No. 1336 of 2017.

// By Court Order//

M/s. M.V. Swamy & Associates
Advocates
Office: SRT 733, Sanathnagar, Hyd-18,
Cell: 9346507505.

IN THE HONOROBLE COURT OF THE VII SPECIAL MAGISTRATE COURT AT VISAKHAPATNAM
C.C. No. 1962/2023

Between:
Shriram Transport Finance Co.Ltd. Visakhapatnam, rep. by its GPA Holder
...Complainant
VERSUS
Gundeti Laxmana ...Accused
Accused:
Gundeti Laxmana, S/o. G Guruvulu, C/o. Lakshman Travels & Tourist, D.No. 33-6-68, Hotel Jaipur, Allipuram, Visakhapatnam - 530004.
Present Address:
D.No. 32-26-9, Opp: Smart Point Super Market, Captain Rama Rao Junction, Allipuram, Visakhapatnam - 530004.

NOTICE

The accused may take Notice that the above complainant filed a complaint under Negotiable Instruments Act against you. The said case stands posted on 23.07.2024 at 10.30 A.M. for your appearance. Therefore take Notice and appear before the court in person or through your Advocate in the above named court at.10.30 A.M on 23.07.2024, failing which you will be set exparte and petition will be allowed against you.

Hence this Notice.

B. Bhanu Prasad Babu, Advocate, Visakhapatnam
Visakhapatnam.
Dt:15-07-2024

IN THE HON'BLE COURT OF THE III ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) AT: VISAKHAPATNAM
I.A.248/2023 in O.S.268/2019

Between:
Sri Mylapilli Sree Rama Murthy
...Petitioner/Plaintiff
And:
1) Mylapalli Nookalamma
2) Mylapalli Naga Raju (Died)
...Defendants
3) Mylapalli Sowjanya
...Resondent/Proposed 3rd Defendant

NOTICE

To the proposed 3rd Defendant:
Mylapalli Sowjanya,
W/o. late Naga Raju, Hindu, aged 29 years, R/at D.No.20-109-5, Kotha Agraharam Street, Chengalaraopeta, Visakhapatnam-01

Please take notice that the above named petitioner/plaintiff has filed above I.A.248/2023 to implead the legal heir of the deceased 2nd defendant as proposed 3rd defendant in the above suit and the same stands posted to **26-07-2024** for your appearance either in person or through a pleader on the above said date at **10:30 A.M.** to answer all material questions failing which the matter will be heard and determined in your absence exparte, as per law.

B.K. NAIDU,
Advocate
Visakhapatnam,
Cell:9848077747

పారిశుధ్యం మెరుగుపరచాలి

పద్మనాభం మండల సమావేశంలో ఎంపిపి రాంబాబు



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి రాంబాబు

ప్రజాశక్తి- పద్మనాభం : రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని గ్రామపంచాయతీలో పారిశుధ్యం మెరుగుపరచాలని సర్పంచులకు, కార్యదర్శులకు ఎంపిపి రాంబాబు ఆదేశించారు. మండలంలోని పద్మనాభం మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో ఎంపిడిఒ కార్యాలయం సమావేశం మందిరంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా గ్రామీణ తాగునీరు విభాగం అధికారులతో సమీక్ష ప్రారంభించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి పంచాయతీకి ఎప్పటికప్పుడు మంచినీరు పరిశీలనకు కిట్లు పంపిణీ చేశామని ఎంపిపి చెప్పారు. జలజీవన్ మిషను కింద మండలంలోని 90 పనులు మంజూరు కాగా అందులో 60 ప్రారంభిస్తే 29 పనులు పూర్తయ్యాయని తెలిపారు. గంధవరం సర్పంచ్ జివివికె.వర్మ, ఎంపిటిసి సభ్యులు రమణరాజు లేచి గ్రామానికి ఒక ప్రాంతానికే తాగునీరు అందుతుందని, మిగిలి ఉన్న ప్రాంతంతోకి రావడం లేదని తెలిపారు. ఈ సమావేశంలో అధికారులను నిలదీశారు. గత సమావేశములో కూడా ఇదే సమస్యను తెలియజేశామన్నారు. విద్యుత్ శాఖ జూనియర్ ఇంజినీర్ రమేష్ మాట్లాడుతూ. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉన్న సమస్యను పూర్తిగా పరిష్కారం చేసినట్లు చెప్పారు. ఆ సమయంలో వెంకటాపురం గ్రామానికి చెందిన సర్పంచ్ కె. రమణ మాట్లాడుతూ విద్యుత్తు లైను కొన్ని ఇళ్లపై నుంచి ఉండడంతో పది స్తంభాలు మార్చడానికి, నాలుగు లక్షల ఖర్చు అవుతుందని విద్యుత్ శాఖ అధికారులు వివరించారు. బి.తాళ్లవలసలో 2 ట్రాన్స్‌ఫార్మర్లు ఇటీవలే దొంగల పాలఅయ్యాయని తెలిపారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఎవి.చలమ్ మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌కు రైతులకు సరిపడే విత్తనాలు పంపిణీ చేశామన్నారు. భూసారం పెంపొందించేందుకు పచ్చిరొట్ట పంపిణీ చేశామని తెలిపారు. ఏపీవో వరలక్ష్మి మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో మండలంలోని 11500 గ్రూపులు ఉన్నాయని, సభ్యులు 2,84,000 పనివదినాలు పూర్తి చేశారని తెలిపారు. సన్న, చిన్న కారు రైతులకు వివిధ రకాల పండ్ల తోటలు పెంపొందించుకోవడానికి వాటి నిర్వహణకు ఖర్చులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అవకాశం ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీసీ వెల్ఫేర్ అధికారులు రెడ్డిపల్లి బాలికల హాస్టల్ 46 మంది బాలికలు ఉన్నారని ఇంకా 50 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఎపిఎం ప్రభాకర్ మాట్లాడుతూ. మహిళా మార్ట్ ద్వారా సుమారు కోటిన్నర అమ్మకాలు జరిగాయని తెలిపారు. ఐసిడిఎస్ అధికారులు మండలంలోని 22 గ్రామపంచాయతీలో 57 అంగన్వాడి కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. గర్భిణులకు సరైన పౌష్టికాహారం లేకపోవడంతో వయసుతో సమానంగా పెరుగుదల లేదన్నారు. ఎంఇఒ పి.రమణ మాట్లాడుతూ, 3623 విద్యార్థులు ఏడాది విద్యను కొనసాగిస్తున్నారని తెలిపారు. ఏడు రకాల విత్తనాలను పంపిణీచేశారు. ఏడు రకాల వస్తువుల కిట్లను పంపిణీ చేశామన్నారు.

ఉద్యానవనం శాఖ అధికారులు మాట్లాడుతూ. 50 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. కాలం చెల్లి ఉన్న కొబ్బరి తోటలను మరలా పునరుద్ధరించడానికి ప్రభుత్వం సదుపాయం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బి.శైలజ. వైస్ ఎంపిపి ఈర్ల రాజేశ్వరి. సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గాజువాకలో దారుణ హత్య



ప్రజాశక్తి -గాజువాక : జగ్గు సెంటర్ సమీపం శ్రీకృష్ణ నగర్ రోడ్డులో సోమవారం రాత్రి దారుణ హత్య జరిగింది. మాజీ సైనికుడు ఎం.అప్పలనాయుడు శ్రీకృష్ణనగర్‌లో నివాసముంటున్నాడు. నిందితులు, పోలీసుల కథనం ప్రకారం... ఈ కాలనీకి సమీపంలో ఒక స్థలానికి సంబంధించి తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో పథకం ప్రకారం ఇద్దరు వ్యక్తులు వచ్చి సోమవారం అర్ధరాత్రి అప్పలనాయుడు మెడ మీద కత్తితో దాడిచేశారు. అనంతరం గాజువాక పోలీస్ స్టేషన్లో లొంగిపోయారు. వారిలో ఒకరు ఆటో డ్రైవర్‌గా ఉన్నారు. ఘటనా స్థలానికి ఏసిపి త్రినాధ్ చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న సిహెచ్ పోతురాజు

మంత్రికి వినతులు

ప్రజాశక్తి -గాజువాక : రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును ఆ శాఖ ఉద్యోగస్తులు పాలకొల్లులో ఉన్న వారి కార్యాలయంలో కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.పోతురాజు, సహచర ఉద్యోగులు ఉన్నారు.

వర్షంతో రైతుల్లో ఆనందం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్లో వరి నాట్లు వేసి రైతులు సిద్ధంగా ఉన్నారు. ఈ సమయంలో గత 15 రోజులుగా వర్షాలు లేక రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కురిసిన వర్షానికి గెడ్డల ద్వారా నీరు చెరువుకు చేరింది. ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెం, గుడిలోవ ఛానల్ పెద్ద గడ్డ నుంచి నీరు రావడంతో పొడుగుపాలెం, ఆనందపురం, పెద్దిపాలెం, మచ్చవానిపాలెం తదితర చెరువులైన మర్రి చెరువు, దొంతల వాణిచెరువు, పూర్ణవాణి, పెద్దిపాలెం చెరువులకు నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

మద్యం తాగి వాహనం నడిపితే జరిమానా

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : మద్యం తాగి వాహనాలు నడిపిన 29 మందికి స్థానిక ఎంఎం కోర్టు ఒక్కొక్కరికి రూ10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి సోమవారం తెలిపారు.

మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడిపిన వారిని సోమవారం కోర్టుకు తరలించారు. వారికి స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సెకెండ్ క్లాస్ ఫర్ ఎక్సైజ్ కోర్టులో 48మందిని హాజరుపరచగా రూ.2 వేలు నుంచి 3వేలు వరకు అపరాధ రుసుము విధించినట్లు సిఐ కాంతారావు తెలిపారు.

కణమాం జగనన్న కాలనీ ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం కణమాం గ్రామపంచాయతీలో జగనన్న కాలనీలో ఆక్రమాలకు పాల్పడ్డారని గ్రామానికి చెందిన చందవరపు ప్రకాష్ సోమవారం జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. కనమాం పంచాయతీలో సర్వేనెంబర్ 50లో జగనన్న కాలనీలో 145 మందికి స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మాణం చేపట్టారు. ఈ స్థలం పక్కన సుమారు 20 ఇళ్ల ఆక్రమణలు జరిపి అమ్మకాలు జరిపినట్టు ప్రకాష్ ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామంలో అర్హులైన వారికి ఇవ్వకుండా బయట వారికి అమ్మకాల జరపడంతో గ్రామస్తులు నాయకులపై మండిపడ్డారు. అధికారులు పరిశీలించి ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పిజిఆర్ఎస్‌లో 3 అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో పిజిఆర్‌కాలనీలో ప్రజల నుంచి 3 అర్జీలు అందాయి. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఒకటి, యుసిడి విభాగానికి సంబంధించి రెండు అర్జీలు అందాయి. సంబంధిత అర్జీలను సంబంధిత శాఖాధికారులకు పంపించినట్లు కార్యాలయ సూపరింటెండెంట్ తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగం ఎ సి పి డి శ్రీనివాసరావు, ఎ ఇ, ఎ సుమన్, యు సి డి, ఎ పి డి, సంతోష్ కుమార్ పాల్గొన్నారు

ఆర్‌హెచ్‌సి జలమయం

ప్రజాశక్తి-సింహాచలం : సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రం చిన్నపాటి వర్షానికి బురదమయం అవుతోంది. ఇటీవల బిఆర్‌టిఎస్ పనులు చేపట్టిన సందర్భంగా ఆసుపత్రి కంటే ఎత్తుగా రోడ్డు కాలువలు నిర్మించడంతో ఆసుపత్రి లోతుగా ఉండటంతో వర్షం నీరు ఆసుపత్రిలో చేరుతుంది. కాలువలకు, ఇళ్ల వాడుక నీటికి కనెక్షన్ ఇవ్వకపోవడంతో వర్షం నీరు రోడ్డుగుండా ప్రవహించి ఆసుపత్రిలోకి చేరడంతో ఆసుపత్రి సిబ్బంది నీటికి అడ్డుకట్ట వేసేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆసుపత్రిలోకి నీరు రాకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

చారిత్రక కట్టడాల పర్యవేక్షణపై దృష్టిపెట్టాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : పట్టణంలో చారిత్రక కట్టడాల పర్యవేక్షణపై దృష్టిపెట్టాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు సంబంధిత అధికారులను కోరారు. భీమిలిలో సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, పలు చారిత్రక కట్టడాల చుట్టూరా ఉన్న ముళ్ల పొదలను, తుప్పలను తొలగించాలని సూచించారు. పర్యాటక, చారిత్రక ప్రదేశాలను సందర్శించే క్రమంలో వచ్చే సందర్శకులు, పర్యాటకుల సౌకర్యార్థం గైడ్‌లను ఏర్పాటు చేయాలన్నారు.

భీమిలిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా



జోన్ -2 కార్యాలయం ప్రారంభంలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -పీఎం పాలెం : భీమిలి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్ది ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల రూ.50 లక్షలతో ఆధునీకరించిన జివిఎంసి జోన్-2 కార్యాలయాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో తాను ఎక్కడ కనిపించినా భీమిలి ప్రజలు తమ నియోజకవర్గానికి రావాలని అడిగేవారని, అయితే వారు తనపై నమ్మకాన్ని ఓట్ల రూపంలో చూపించి రాష్ట్రంలోనే రెండో అత్యధిక మెజారిటీ ఇచ్చారని అలాంటి ప్రజలకు తాను రుణపడి ఉంటానని చెప్పారు. భీమిలి నియోజకవర్గంలో 2014 నుండి 19 వరకు తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తోందని, తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం బటన్ నొక్కుతూ రూ.13 లక్షల కోట్లు అప్పులు చేశారని ఆరోపించారు. రానున్న రోజుల్లో విశాఖపట్టణం అభివృద్ధికి ప్లాన్ రెడీ చేస్తున్నామని, అందులో భాగంగానే మధురవాడ మోడల్‌గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. జీవీఎంసీ జోన్ 2 కార్యాలయాన్ని రూ.50 లక్షలతో ఆధునీకరణ చేయటం సంతోషమన్నారు. మధురవాడలో పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయని, త్వరలోనే జిల్లా అధికారులతో క్షేత్రస్థాయిలో సమావేశమై వాటిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్- 2 జెడ్‌సి శైలజవల్లి, 5, 7 వార్డుల కార్పొరేటర్లు మొల్లి హేమలత, పిల్ల మంగమ్మ, మొల్లి లక్ష్మణ, గరే గురునాథ్, వానరాసి అప్పలరాజు, పిల్ల వెంకట్రావు, ఎన్ ఎన్ నాయుడు రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సిఆర్‌జెడ్ నోటిఫికేషన్‌పై అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : కోస్టల్ జోనింగ్ ప్లాన్ అమలులో భాగంగా సిఆర్‌జెడ్‌పై ఇప్పటికే తయారుచేసిన ముసాయిదాపై ఈ నెల 27వ తేదీ లోపు అభ్యంతరాలను తెలప వచ్చని జివిఎంసి ఒకటో జోన్ పట్టణ ప్రణాళిక విభాగం ఎసిపి డి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. సముద్ర తీర ప్రాంతంలో శాశ్వత కట్టడాలు, నిర్మాణాలకు సంబంధించి 2011లో సిఆర్‌జెడ్ నిబంధనలు తెలుపుతూ మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు తెలిపారు. ఇదే తరహాలో మరికొన్ని నిబంధనలతో 2019లో సిఆర్‌జెడ్‌కు సంబంధించి సిజెడ్‌ఎంపి మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు పేర్కొన్నారు. దీని అమలులో భాగంగా విడుదల చేసిన నోటిఫికేషన్‌పై ఈ నెల 27వ తేదీ లోపు తమకు అభ్యంతరాలు తెలియ జేయవచ్చని సూచించారు.

బేటీ బచావో, బేటీ పడావోపై కళాజాతా

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని పాలవలస అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు బేటీ బచావో, బేటీ పడావోపై అవగాహన కల్పిస్తూ కళాజాతా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాలవలస ఎంపిటిసి సభ్యులు రౌతు శ్యామల హాజరై బాలల హక్కులు చట్టాలపై వివరించారు. బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. కళాజాత విజయవాడ గుడివాడ ఆల్ ఇండియా రేడియో టీవీ ఆర్టిస్టుల సంఘం అధ్యక్ష, కార్యదర్శి ఎడవల్లి దుర్గారావు సుంకర రాజు మాట్లాడుతూ, బాలికల సంరక్షణకు భీమిలి నియోజకవర్గంలో 144 కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. బాలికలను జాగ్రత్తపరిచి, సమాజంలో బాలికలపై దాడులను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పద్మావతి కుమారి, పాలవలస గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కరెంటు బిల్లుల చెల్లింపు కౌంటర్ ప్రారంభించాలి

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంతంలో మల్కాపురం సబ్ స్టేషన్ వద్ద కరెంట్ బిల్లులు చెల్లింపు కౌంటర్ ప్రారంభించాలని స్థానికులు కోరారు. మల్కాపురం కరంట్ ఆఫీస్ వద్ద ప్రతి నెలా సోమ, గురువారం బిల్లులు చెల్లింపు పద్ధతులు జరిగేవని, ఇప్పుడు మీసేవలో చెల్లింపునకు రూ.10 అదనంగా చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఫోన్‌లో ఇప్పుడు నూతన యాప్ వల్ల కొందరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రజలకు సేవలు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇపిఎస్.భాగ్యలక్ష్మి

దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి- ములగాడ : స్వాతంత్ర సమరయోధులు, సంఘసంస్కర్త, సామాజిక కార్యకర్త అయిన దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన సోమవారం డాక్టర్ దుర్గాబాయి దేశ్ ముఖ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దుర్గాబాయ్ దేశ్ ముఖ్ చెన్నైలో, హైదరాబాదులో ఆంధ్ర మహిళా సభను స్థాపించారని, ఆమె భారత రాజ్యాంగ పరిషత్‌లో, ప్రణాళిక సంఘంలో సభ్యురాలిగా పని చేశారని, మహిళల హక్కుల కోసం పోరాడారని గుర్తుచేశారు. ఆమె తెలుగింటి ఆడపడుచు కావడం గర్వకారణమని అన్నారు. విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో ఆమె ఎంఎ పొలిటికల్ సైన్స్ చదివారని, చెన్నైలో న్యాయ శాస్త్రాన్ని అభ్యసించారని అన్నారు. పేద మహిళల కోసం ఆమె అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. ఆంధ్ర మహిళ అనే పత్రికను స్థాపించారని, అనేక వసతి గృహాలు, నర్సింగ్, వృత్తివిద్యా కేంద్రాలు మహిళల కోసం ఏర్పాటు చేశారని తెలిపారు. సమావేశంలో జాతీయ సేవా పథక సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయదేవి, అధ్యాపకులు శిరీష, త్రివేణి, సలోమి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గాబాయి దేశ్ ముఖ్‌పై నిర్వహించిన క్విజ్‌లో విజేతలైన విద్యార్థినులకు బహుమతులను పంపిణీ చేశారు. సమావేశంలో పాల్గొన్న వారందరినీ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసెల్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అభినందించారు.

పెన్షన్‌దారులకు రేషన్ కార్డు ఇవ్వాలి

ప్రజాశక్తి -గాజువాక : పెన్షన్‌దార్లకు రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరుతూ ఆల్ పెన్షన్ రిటైర్డ్ పర్సనల్ అసోసియేషన్ ఆధ్వర్యాన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. మినిమం పెన్షన్ రూ.9000 ఇవ్వాలని, మెడికల్ సౌకర్యం కల్పించాలని, రైళ్లలో ఛార్జీ రాయితీ ఇవ్వాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆపరా సంఘం నాయకులు వర్మ, కె.దీనబంధు, హుస్సేన్, కణితి అప్పలరాజు, పిట్ట గుర్నాథ్, నమ్మి కుమార్, కెవి.రమణ, నమ్మి అప్పల్నాయుడు, నమ్మి అప్పారావు, కె.పెంటారావు, ములగలపిల్లి పెంటారా, ఎన్‌వి.రమణ, సన్యాసిరావు, వెంకట్రావు టిడిపి నాయకులు పులి రమణారెడ్డి ఉన్నారు.



ఎమ్మెల్యే పల్లాను కలిసిన పెన్షనర్లు

కేంద్ర మంత్రి పర్యటించినా.. మెరుగు పడని ప్లాంటు పరిస్థితి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ కేంద్ర మంత్రి పర్యటించినా దాని పరిస్థితి మెరుగుపడలేదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు సోమవారం నాటికి 1250వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఎంఎంఎస్‌ఎం, ఎస్‌టిఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ, ప్రధాని ఆదేశాలతో కేవలం నెల రోజుల్లో ప్లాంటు పరిస్థితులను మెరుగుపరిచేందుకు వచ్చానని చెప్పిన కేంద్రమంత్రి కుమారుస్వామి పర్యటన వల్ల కార్మికుల్లో, ఈ ప్రాంత ప్రజల్లో కొత్త ఆశలు చిగురించినా ప్లాంట్ పరిస్థితిలో ఎలాంటి మార్పూ లేదన్నారు.

ఇండోనేషియా నుంచి వచ్చిన కోకింగ్ కోల్ వెసెల్‌కు నెల రోజుల నుంచి రోజుకు రూ.50 లక్షలు చొప్పున డెమరేజ్ కడుతున్నారని తెలిపారు. మరొక షిప్పుకు కస్టమ్స్ డ్యూటీ అతికష్టం మీద కట్టడంతో పది రోజులకు సరిపడే రా మెటీరియల్ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఐరన్ ఓర్ లంప్స్ కేవలం 10 రోజులకు మాత్రమే ఉన్నాయన్నారు. పవర్ జనరేషన్ చేయడానికి బాయిలర్ కోల్ (డొమెస్టిక్) హ్యాండ్ టు మౌత్, లెస్‌దేన్ వన్డేకు మాత్రమే పరిమితమైందని వివరించారు.



దీక్షలో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు, నాయకులు

కేంద్ర మంత్రి పర్యటన తర్వాత త్వరితగతిన భారీ మార్పులు సంభవిస్తాయని, కుమారస్వామి ఆధీనంలో ఉన్న (ఒకే మంత్రిత్వ శాఖ) సెయిల్, ఎన్‌ఎండిసి, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలుతో మాట్లాడి ఎంతో కొంత మేలు చేకూరుస్తారని అందరూ భావించారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పూర్వస్థితికి రావడానికి 2నెలలు కాలం పడుతుందని, ఈ లోపు అన్నీ సవ్యంగా జరుగుతాయని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినా మార్పు లేదన్నారు. ఉత్పత్తికి సరిపడా రా మెటీరియల్ లేదని అధికారులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. మూడు నెలల నుంచి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు లేవని, పర్మినెంట్ ఉద్యోగులకు నెలకు సగం జీతం మాత్రం ఇస్తునానరని, అధికారులకు అది కూడా ఇవ్వడం లేదని వివరించారు. ఈ పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా స్పందించకపోవడం దురదృష్టకర మన్నారు.

ప్లాంట్ పూర్తిగా మూతపడిన తర్వాత, భారీ విస్ఫోటనం జరిగిన తర్వాత ముఖ్యమంత్రి స్పందించినా చేయగలిగిందేమీ ఉండదన్నారు. ప్లాంట్ భారీ నష్టాలకు, ఈ పరిస్థితికి కారకులైన వారే పరిరక్షిస్తాం, కాపాడుతాం, విలీనం చేస్తాం, ఆర్థిక ప్రయోజనాన్ని కల్పిస్తాం, అని చేస్తున్న ప్రకటనలు ప్రజలను అయోమయంలో పడవేస్తున్నాయన్నారు. తక్షణం రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్లాంట్ సాధారణ ఉత్పత్తి దిశగా నడిచేందుకు, వేలాది మంది కార్మికుల వేతనాలు సకాలంలో ఇచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

రైల్వే వేగన్ వర్కర్లకు...

జిఒ ప్రకారం జీతాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌బాబు, ఎం.రాంబాబు తదితరులు

ప్రజాశక్తి -గాజువాక : రైల్వే వేగన్ వర్క్ షాప్ వర్కర్లకు జిఒ ప్రకారం జీతాలు చెల్లించాలని ఆల్ ఇండియా రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు డిమాడ్‌చేశారు. వడ్లపూడి రైల్వే వేగన్ వర్క్ షాపు వద్ద సోమవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి నెల 10వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని, ప్లేసిప్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పర్మనెంట్ వర్కర్స్ చేసిన పనికి కాంట్రాక్టు కార్మికులు జీతాల ఇవ్వటం, కాంట్రాక్ట్ కార్మికులకు జిఒ ప్రకారం ఇవ్వకపోవడం దుర్మార్గమని అని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సిఐటియు కార్మికులకు అండగా ఉంటదని భరోసా ఇచ్చారు. రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ దేశవ్యాప్తంగా 8 లక్షల మంది ఉన్నారని, వారి మద్దతుకు మీకు ఉంటుందని తెలిపారు. రైల్వే మినిస్టర్‌కు పార్లమెంట్ ఎంపీలు, డిఆర్‌ఎంకు వినతి పత్రాలు ఇచ్చి న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. రాష్ట్ర రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ ప్రధాన కార్యదర్శి వి.నరసింహ మాట్లాడుతూ, రైల్వే వేగన్ వర్క్ షాప్ కార్మికులు పనిచేయట ద్వారా, కాంట్రాక్టర్లు రూ. లక్షల్లో సంపాదిస్తున్నారని తెలిపారు. ఈ సమస్యలపై ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రైల్వే వ్యాగన్ వర్క్ షాప్ వర్కర్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రాంబాబు మాట్లాడుతూ, సేఫ్టీ ప్లే షిప్స్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. దీనిని సిఐటియు చూస్తూ ఊరుకోదని భవిష్యత్తులో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివి.రాజు, కె.అవతారం, వెంకటేశ్వరరావు కార్మికులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు సామాజిక పెన్షన్ ఇవ్వాలి

ప్రజాశక్తి -గాజువాక : గీత కార్మికులకు సామాజిక పెన్షన్‌తో పాటు, ప్రమాదంలో గాయపడిన వారికి నష్టపరిహారం చెల్లించాలని టిడిపి అధికార ప్రతినిధి నెల్లి సాధూరావు గాజువాక జోనల్ కమిషనర్ వి సన్యాసినాయుడుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గీత కార్మికులు తమ వృత్తి నిర్వహణలో చెట్టు మీద నుంచి జారిపడినప్పుడు గాయాలపాలైన వారికి నష్టపరిహారం కల్పించాలని కోరారు. ఆయనతోపాటు నూకరాజు, లక్ష్మణరావు, ఈశ్వరరావు ఉన్నారు.



గాజువాక జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాధూరావు

52వ వార్డులో డిప్యూటీ మేయర్ పర్యటన

ప్రజాశక్తి-కరాస : జివిఎంసి 52వ వార్డు పరిధి మర్రిపాలెం, ఉడా లే-అవుట్ రజకవీధిలో నగర డిప్యూటీ మేయర్ జియ్యని శ్రీధర్ సోమవారం పర్యటించారు. కళావేదిక పనులను ఆయన సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం లీడర్ ప్రెస్ కార్యాలయం వద్ద అభ్యంతర కరంగా పెరిగిఉన్న చెట్టు కొమ్మలను తొలగించాలని అధికారులను కోరారు. ఆర్, బి జంక్షన్ వద్ద ప్రత్యేకంగా మహిళల కోసం నిర్మిస్తున్న వనితా వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందబాటులోకి వాకింగ్ ట్రాక్‌ను తేవాలని కోరారు. కార్యక్రమంలో ఎఇ ఉషారాణి, హార్టీకల్చర్ ఎఇ పల్లవి, పారిశుధ్య ఇన్‌స్పెక్టర్ మూర్తి, సచివాలయం సెక్రటరీ సాయి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మిక కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వేపగుంట : గోపాలపట్నం సబ్ డివిజన్ కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తూ ఇటీవల దురదృష్టవశాత్తు అకాల మరణం చెందిన ఎస్.శంకరరావు కుటుంబ సభ్యులకు ఎఇసిఇఎ-జి -3045 యూనియన్ విశాఖపట్నం జిల్లా జోన్-3 కార్మికుల తరపున రూ.75 వేలను జోన్-3 ఇఇ పోలాకి శ్రీనివాస్ అందించారు. కార్మికులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ పరిధి సుజాతనగర్ వద్ద వాహనదారులు ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ సిఐ శ్రీనివాసరావు ట్రాఫిక్‌లో పాటించాల్సిన నియమావళిపై అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్ ధరించి నడపాలని సూచించారు. ఆటో డ్రైవర్లు అతివేగంగా ఆటోలు నడపవద్దని, కూడలిలో కొంచెం ముందుకు వెళ్లి ఆటోలు ఆపాలి తప్ప సడన్‌గా ఆపడం వల్ల వెనుక వచ్చే వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని ఆటో డ్రైవర్లు గమనించాలని సూచించారు. ముఖ్యంగా మద్యం తాగి వాహనాన్ని అసలు నడపరాదన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ నర్సింగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి -ములగాడ : ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని, వాహన చోదకులు ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలని హార్బర్ ట్రాఫిక్ సర్కిల్ సిఐ సువ్వారు షణ్ముఖ రావు హెచ్చరించారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం వై జంక్షన్, సింథియా జంక్షన్, ఎక్స్ సర్వీసెమెన్ కాలనీ, ఫైర్ స్టేషన్ జంక్షన్, పరిసరాల్లో వాహన తనిఖీలు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా సిఐ, ఇతర పోలీస్ సిబ్బంది మైకుల ద్వారా వాహన చోదకులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. వాహన చోదకులు తప్పకుండ హెల్మెట్ ధరించాలని, కార్ డ్రైవర్లు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు.

లైసెన్స్ లేకుండా రోడ్డుపై వాహనాలు నడుపరాదని, త్రిబుల్ రైడింగ్ నేరమని, ఆటో డ్రైవర్లు ఓవర్ లోడ్ ఎక్కించరాదని కోరారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియమాలు పాటించని వారికి ఫైన్‌లు వేస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
5
మంగళవారం 16 జులై 2024

వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద రైతు సంఘం ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలని కోరుతూ సోమవారం ఎపిఇపిడిసిఎల్ అనకాపల్లి జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అనంతరం డివిజనల్ ఇంజనీర్‌కు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ వద్ద కూడా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాధం, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడుతూ మునగపాక మండలంలో వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు అత్యంత వేగంగా అమర్చుతున్నారని తెలిపారు. రైతుల ఆమోదం లేకుండానే ఏకపక్షంగా మీటర్లు బిగిస్తున్నారన్నారు. రైతులను భయభ్రాంతులకు గురి చేసి మీటర్లు వేస్తున్నారని, దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాద యాత్ర సందర్భంగా వ్యవసాయ పంపుసెట్ల స్మార్ట్ మీటర్లు వేస్తే ధ్వంసం చేయాలని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. కాని నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ నిర్ణయాన్నే అమలు చేయడమంటే రైతులను మోసం చేయడం తప్ప మరొకటికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ చట్టం చాలా ప్రమాదకరమైందని, దానిని అమలు చేస్తే ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు.



ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం ధర్నా చేస్తున్న రైతు, వ్యకాస నాయకులు

ఆ చట్టాన్ని అమలు చేసి ఎపి రైతులకు ఉరితాళ్ళు వేయవద్దని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు రామసదాశివరావు, బుద్ద రంగారావు, సిఐటియు మునగపాక నాయకులు ఎస్.బ్రహ్మాజీ, బుజ్జి, మహేష్, తిమ్మరాజుపేట గ్రామ ఉప సర్పంచ్ భీశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి కెజిబివి విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదివిన లక్కవరపు మౌనిష పదో తరగతిలో 559 మార్కులు సాధించి, శ్రీకాకుళం త్రిపుల్ ఐటీలో మొదటి లిస్టులో సీటు పొందినట్లు ప్రిన్సిపాల్ ఎ.మృదుల తెలిపారు. మౌనిష తల్లిదండ్రులు సోములు, లావణ్య సబ్బవరం మేజర్ పంచాయితీ శివారు పాత సబ్బవరం గ్రామానికి చెందిన వారు. ఈ సందర్భంగా మౌనిషను ప్రిన్సిపల్ మృదుల, పాఠశాల సిబ్బంది, ఎం ఈ ఓ-2 బి ఎస్ ఎన్ మూర్తి అభినందించారు.



మౌనిష

'కూటమి ప్రభుత్వంలో బీసీలకు న్యాయం'

ప్రజాశక్తి-అనకాపల్లి : టిడిపి కూటమి ప్రభుత్వంలో బీసీలకు న్యాయం జరుగుతుందని టిడిపి రాష్ట్ర బీసీ సాధికారత సమితి కన్వీనర్ మల్ల సురేంద్ర అన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేశన శంకర్రావు జన్మదిన సందర్భంగా అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కొణతాల చంద్రరావు ఆధ్వర్యంలో స్థానిక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ముందుగా బీసీ నాయకులు సమక్షంలో కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్ల సురేంద్ర మాట్లాడుతూ వైసిపి ఎన్నికలకు ముందు బీసీలే నా వెన్నుముక్కని చెప్పి, గెలిచిన తర్వాత బీసీలకు పెత్తనం లేకుండా చేశారని ఎద్దేవా చేశారు. అనంతరం పేద మహిళలకు చీరల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో బుద్ధ భూలోక నాయుడు, బొడ్డేడ అప్పారావు, పోలవరపు త్రినాధ్, కోట సూర్యనారాయణ శాస్త్రి, మల్ల జగన్మోహన్, బుద్ధ నాగేశ్వరరావు, బొల్లెం కోసరాజు, పెంటకోట శ్రీనివాసరావు, మల్ల ప్రసాద్, కర్రి సుబ్రహ్మణ్యం, ఎల్లపు శ్రీనివాసరావు, బి చంద్రవాని, కొణతాల జగదీష్, కోరుబిల్లి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఏఎంసీ కాలనీలో తాగునీరు మోటర్‌కు సోమవారం మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించారు. అనకాపల్లి పట్టణ 83వ డివిజన్ ఏఎంసీ కాలనీలో 8 అపార్ట్మెంట్స్ 192 కుటుంబాలు నివసిస్తున్నారు. అక్కడ కొన్ని రోజులుగా మూడు ఫ్లాట్లు 72 గడపలకు సంబంధించి తాగునీరు సమస్య ఉండడంతో అక్కడ ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయాన్ని స్థానిక కూటమి నాయకులు డివిజన్ ఇంచార్జ్ బొద్దపు ప్రసాద్, వార్డ్ ఇంచార్జ్‌లు పిట్ల రాజు, ఎస్.భానుచందర్, దేవీ అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణకు తెలియజేశారు. దీనిపై స్పందించిన వారు తక్షణమే సమస్యను పరిష్కరించాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. దీంతో8 అధికారులు వచ్చి కొత్త మోటర్‌ను బిగించి సమస్యను పరిష్కరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు షేక్ రియాజ్, చెక్క నూకరాజు, మిడిపాటి సాయి జగన్, సామ్యూల్, కిరణ్, ప్రసాద్, జీవీఎంసీ వర్క్ సిబ్బంది పాల్గొన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న తహశీల్దారు, స్థానిక నాయకులు

తాడి గ్రామం తరలింపునకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - పరవాడ : రాంకీ ఫార్మాసిటీ లోని ఫార్మా కాలుష్య బారిన పడిన తాడి గ్రామాన్ని తరలించడానికి పెదముషిడివాడ రెవిన్యూలో అవసరమైన భూమి పరిశీలన సోమవారం తహశీల్దార్ గణపతిరావు చేశారు. తాడి గ్రామాన్ని తరలించాలని గ్రామస్తులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కూడా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తహశీల్దార్ గణపతిరావు సోమవారం స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పైల జగన్నాధరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, జనసేన పార్టీ నాయకులు పంచకర్ల ప్రసాద్‌రావు, బొద్దపు శ్రీనివాస్ కాసులు, బుగిడి గోవిందరావు, టిడిపి నాయకులు వియ్యపు చిన్న , మాజీ కార్పొరేటర్ దుల్ల రామునాయుడు, రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, తాడి మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, నాయకులు బలిరెడ్డి అప్పారావు, కరణం నరసింగరావు, కోమటి సూరిబాబు, గొల్లవిల్లి అచ్చిబాబు పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి నేత రత్నాకర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కస్పావీధిలో మాజీ కౌన్సిలర్ కోటిపల్లి జేజిబాబు, కోటిపల్లి శ్రీను ఆధ్వర్యంలో నిరుపేద మహిళలు 90 మందికి ఐదు కేజీలు చొప్పున రైస్ బ్యాగులను అనకాపల్లి టౌన్ సిఐ జి.శంకర్రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ముందుగా జనసేన నాయకులు కాంద్రేగుల జోగేంద్ర, ఎల్లపు శ్రీను కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. అనంతరం పట్టణ సిఐని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గోళి మురళి, రీసు ఆచారి, శొంఠ్యాన సతీష్, జి.భాగ్యలక్ష్మి, ధవలేశ్వరం లక్ష్మణరావు, మహిళలు పాల్గొన్నారు.

కశింకోట : టిడిపి రాష్ట్ర నాయకులు దాడి రత్నాకర్ పుట్టినరోజు వేడుకలు కశింకోట ప్రేమ సమాజం వద్ద టిడిపి మండల నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.



కశింకోట ప్రేమ సమాజానికి సరుకులు ఇస్తున్న టిడిపి నేతలు

ఈ సందర్భంగా ప్రేమ సమాజంలో ఉన్నవారికి నెల రోజులకు సరిపడే విధంగా కిరాణా సరుకులు, దుప్పట్లు, పిల్లలకు పాఠ్య పుస్తకాలు అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రత్నాకర్ మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎంతో కష్టపడి పని చేసి కూటమి విజయంలో పాలు పంచుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాయల మురళీధర్, ఉగ్గిన రమణమూర్తి, వేగి గోపికృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, వేగి దొరబాబు, పెదపాటి కళ్యాణి, నిమదాల సన్యాసినాయుడు, పెంటకోట రాము, కలగా సోమేశ్వరరావు, కుక్కల రమణ, అందె రమణ, దాడి నాగరాజు పాల్గొన్నారు.

చిరు జల్లులతో వరినారుకు ఊపిరి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : సోమవారం ఉదయం నుండి కురుస్తున్న చిరుజల్లులకు వరి నారుకు ఊపిరి అందినట్లు అయింది. వారం రోజులు క్రితం మండలంలోని చిన్నప్పన్నపాలెం, దిబిడి,బుచ్చయ్యపేట, కందిపూడి, రాజాం, నీలకంఠాపురం, మల్లం, తురకలపూడి, సీతయ్యపేట తదితర గ్రామాల రైతులు వరి ఆకులను వేశారు. వరి ఆకులు వేసిన వెంటనే వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. వరి ఆకులు ఎండిపోతాయేమోనని ఆందోళన చెందుతున్న నేపథ్యంలో సోమవారం ఉదయం నుండి చిరుజల్లులు కురవడంతో వరి ఆకులకు ఉపశమనం కలుగుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

చిరు జల్లులతో వారపు సంతకు అంతరాయం

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట మండలంలో సోమవారం చిరు జల్లులు కురిశాయి. దీంతో తాళ్ళ పాలెం వారపు సంతకు కొంత అంతరాయం ఏర్పడింది. వ్యాపారులు, రైతులు, కొనుగోలుదార్లు ఇబ్బంది పడ్డారు. తెచ్చిన సరుకులు అమ్ముడుపోకపోవడంతో నిరాశకు గురయ్యారు.



పచ్చబడిన వరి నారు మడి

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా



చింతలపూడి సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు పెండింగ్‌లో వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యాన మండలంలోని చింతలపూడి సచివాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సచివాలయ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు బిటి దొర మాట్లాడుతూ చింతలపూడి పంచాయతీ కోరాడ, వంతువన్నపాలెం, చింతలపూడి, కొత్తూరు, వీరభద్రపేట గ్రామాల్లో నాలుగు వారాలు నుండి కూలీలకు బిల్లులు చెల్లించలేదని, మే నెలలో రెండు వారాలు, జూన్ నెలలో రెండు వారాలు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. గరిసింగి, వాలాబు, చింతలపూడి పంచాయతీలతో పాటు మండలం మొత్తం ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉపాధి హామీ కూలీలు పల్గొన్నారు.

ప్రభుత్వ గెడ్డవాగులో హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని నారపాడు పంచాయతీ శివారు బలిజ పాలెం గ్రామంలో సర్వే నెంబర్ 261లో ఇటీవల ఆక్రమణకు గురైన ప్రభుత్వ గెడ్డవాగు స్థలంలో స్థానిక రెవెన్యూ అధికారులు సోమవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ గెడ్డవాగును సర్వే చేసి హద్దులు గుర్తించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామని, ఆ స్థలాన్ని ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేత మామిడి కొండాజి, విఆర్‌ఓ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న బిఎన్ రోడ్డు

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాది జంక్షన్ బల్క్ మిల్క్ కేంద్రం దగ్గర బిఎన్ రోడ్డు చెరువుని తలపిస్తోంది. సోమవారం కురిసిన వర్షానికి వడ్డాది జంక్షన్ జలమయమైంది. వడ్డాది బల్క్ మిల్క్ ఎదురుగా భీమునిపట్నం -నర్సీపట్నం రోడ్లో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి అందులో నీరు నిలిచిపోతుంది. ఈ నీటి వలన జంక్షన్ అంతా చెరువు లాగా కనిపిస్తుంది. వాహనదారులు రోడ్డుపై నుండి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చోడవరం నుండి అటు పాడేరు ఇటు నర్సీపట్నం వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. దీంతో అనేక వాహనాలు ప్రతిరోజు రాకపోకలు సాగిస్తుంటాయి జంక్షన్లో ఎక్కువ నీరు నిలిచి ఉండకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ చెరువుగా ఉన్న రహదారికి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.



మెయిన్ రోడ్డుపై ఉన్న వర్షపునీరు



మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - యలమంచిలి : ద్విచక్ర వాహనదారులంతా హెల్మెట్ వాడకాన్ని తప్పనిసరి చేసుకోవాలని యలమంచిలి కోర్టు జడ్జి విజయ సూచించారు. యలమంచిలి జడ్జి ఆధ్వర్యంలో యలమంచిలి డిగ్రీ కాలేజీ నుండి బస్టాండ్ వరకూ విద్యార్థులు, పోలీసులతో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి హెల్మెట్ మూలంగా ఎన్నో ప్రాణాలు కాపాడవచ్చో అవగాహన కల్పించారు. ట్రాఫిక్ పోలీసులు కూడా ఈ సంగతి వాహనదారులకు వివరించాలని ఆమె కోరారు. కార్యాక్రమంలో అధిక సంఖ్యంలో విద్యార్థులు, ట్రాఫిక్ సిబ్బంది, టౌన్ ఎస్.ఐ. పాపినాయుడు అధిక సంఖ్యలో లాయర్లు పాల్గొన్నారు.

వరి నారు మడుల పరిశీలన

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని ఎన్‌జి.పాలెం గ్రామంలో వరి నారు మడులను కశింకోట వ్యవసాయాధికారి ఎం.స్వప్న సోమవారం పరిశీలించారు. ఎన్‌జి.పాలెం రైతుసేవా కేంద్రం పరిదిలోని వ్యవసాయ యాంత్రీకరణ కేంద్రంలో వ్యవసాయ పనిముట్లును పరిశీలన చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మధు, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

జగన్నాథస్వామిని దర్శించుకున్న పీలా

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గూడ్స్ రోడ్డులోనీ ఇంద్రద్యుమ్న హాల్లో ఉన్న శ్రీజగన్నాథస్వామిని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ సోమవారం దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్, సభ్యులు అయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ళ సురేంద్ర, బిఎస్ఎంకె జోగి నాయుడు, పోలారపు త్రినాథ్, సబ్బవరపు గణేష్, గొర్లి శేఖర్, సూరే సతీష్ కుమార్, ఛైర్మన్ దాడి బుజ్జి, నారాపిన్ని చంద్రశేఖర్, సత్తిబాబు, దాడి వాసు, నూకరాజు, యళ్లపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలో రోజు, రోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని, రోడ్డు ప్రమాదాలు జరుగ్కుండా తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జివిఎంసి అనకాపల్లి జోనల్ కార్యాలయం వద్ద ప్లకార్డులు, ప్లెక్సీలతో సోమవారం నిరసన తెలిపారు. అనంతరం జోనల్ కమిషనరు ఒమ్మి అయ్యప్పనాయుడుకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు బల్లా నాగభూషణం, నాయకులు వినకోట నీలేశ్ గుప్తా, రొబ్బి మల్లేశ్వరరావు, సోమరాజు పాల్గొన్నారు.

టిడిపి నేత వాకాడకు పంచకర్ల పరామర్శ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గాలిభీమవరం పంచాయితీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు వాకాడ గోవిందరావు ఇటీవల గాయపడగా, విషయం తెలుసుకున్న పెందుర్తి ఎమ్మెల్యే సోదరుడు పంచకర్ల వెంకటేశ్వరరావు సోమవారం గోవిందరావు ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బలిరెడ్డి అప్పారావు, సాలాపు వెంకటేశ్వరరావు, ఇందల వెంకటరమణ, కర్రి కనకరాజు, బలిరెడ్డి రామకృష్ణ, కంచిపాటి రాంబాబు, గడ్డప్ప, సోము నాయుడు, వాకాడ సంతోష్ కుమార్, వాకాడ కనకరాజు, బంతికోళ్ల పద్మ, టి.శేఖర్, ప్రసాదు, వెంకీ, చిరుత, మంగరాజు, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



వాకాడను పరామర్శిస్తున్న జనసేన నేత పంచకర్ల తదితరులు

కలెక్టరేట్ వద్ద నిరసనలు

పలు సమస్యలపై పబ్లిక్ గ్రీవెన్స్‌లో వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుండి పథకాలు అమలు చేయాలి, మెమో1214ను రద్దు చేయాలని కోరుతూ అనకాపల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం పబ్లిక్ గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అడిగర్ల రాజు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం గత ఐదేళ్లలో నిర్మాణ రంగాన్ని సర్వనాశనం చేసిందని, ఇసుక సమస్య, సంక్షేమ పథకాల నిలుపుదల, కార్మికుల సొమ్ము తరలింపు వంటి చేయకూడని పనులు చేసి కార్మికుల కుటుంబాలను రోడ్డుపాలు చేసిందని ఆరోపించారు. నూతన ప్రభుత్వం తక్షణమే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభించాలని, 1214 మెమోని తక్షణం రద్దు చేయాలని, పెండింగ్ క్లయిముల పరిహారాలను తక్షణం చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ సత్తిబాబు, నాయకులు కె.శ్రీను, వి చిరంజీవి, రాము, డి.శివ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

వ్యసన విముక్తి కేంద్ర సిబ్బంది నిరసన

మత్తు వ్యసన విముక్తి కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి 12 నెలలుగా బకాయి ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య రంగంలో ఎంతో ప్రాధాన్యత గల మత్తు వ్యసన విముక్తి కేంద్రాలలో పనిచేస్తున్న సిబ్బందికి కనీసం ప్రతి నెలా జీతాలు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏపీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) కన్వీనర్ వీవీ శ్రీనివాసరావు, సిబ్బంది డాక్టర్ కృష్ణ చంద్ర, ఎస్. క్రాంతి కుమార్, బి.నాయుడు బాబు, రాజ్యలక్ష్మి, శ్రీదేవి, ఏ మణి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను గుర్తించాలని..

రాష్ట్రంలో అత్యధికంగా కౌలు రైతులు సాగు చేస్తున్న నేపథ్యంలో తక్షణమే కౌలు రైతులను గుర్తించి కార్డులు అందజేయాలని రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కో కన్వీనర్ బాలు గాడి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్లో వినతి పత్రం అందజేశారు.

ఫార్మా వ్యర్థాల డ్రమ్ములు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని..

పరవాడ : పరవాడ రాంకీ ఫార్మాసిటీలోని ఫార్మా వ్యర్థ రసాయనాలు డ్రమ్ములను మండలం పెద ముషిడివాడ పంచాయతీ పరిధిలో డంపింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ సర్పంచి పల్లా నాగమణి సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన కలెక్టర్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పిలిచి వెంటనే విచారణ చేసి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పల్ల అప్పారావు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఉద్యోగాలు, ప్యాకేజీపై

పరవాడ : పరవాడ ఫార్మాసిటీలో ఉద్యోగాలు కల్పించాలని హైకోర్టు ఇచ్చిన ఆర్డర్ అమలు చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ముత్యాలంపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు వినతిపత్రం అందజేశారు. తమ పంచాయితీలో సుమారు పది వేల మంది మత్స్యకారులు చేపలవేట జీవనాధారంగా బతుకుతున్నారని, ఫార్మా పైపులైన్లు వల్ల సముద్రం మరియు ఉప్పుటేరులో మత్స్య సంపద నాశనమై మత్స్యకారుల వేట సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మాసిటీలో ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన 500 మంది మత్స్యకారులకు హైకోర్టు తీర్పుకు మేరకు ఉద్యోగాలు కల్పించాలని, ప్యాకేజీ ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటీసి చింతకాయల అమ్మోరు, నాయకులు అర్జిల్లి సోంబాబు, చింతకాయల రమణమూర్తి, చింతకాయల ముత్యాలయ్య, బొంది రంగారావు, కోవిరి తాతారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ గెడ్డవాగు ఆక్రమణపై ..

సబ్బవరం : మండలంలోని సబ్బవరం రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 64లో ప్రభుత్వ గెడ్డవాగులో స్థలాన్ని దురాక్రమణ చేసి సబ్బవరంకు చెందిన కొంతమంది అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, దానిని వెంటనే నిలుపుదల చేయాలని సన్ రైజ్ మెడోస్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్ శ్రీరామదాసు నాగరాజు సోమవారం జిల్లా కలెక్టర్‌కు, మండల తహశీల్దారుకు ఫిర్యాదు చేశారు.

పంచాయతీ అభివృద్ధికి సమిష్టిగా కృషి



ఎమ్మెల్యే రాజును సత్కరిస్తున్న పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది

ప్రజాశక్తి-చోడవరం, చోడవరం రూరల్

చోడవరం పంచాయతీ అభివృద్ధి కోసం అందరూ సమిష్టిగా పనిచేయాలని స్థానిక శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్.రాజు అన్నారు. సోమవారం చోడవరం పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీలో అనేక సమస్యలు ఉన్నాయని వాటన్నిటి పరిష్కారం కోసం రాజకీయాలకతీతంగా పనిచేయాలని సూచించారు. పంచాయితీ పరిధిలోని ఐదు సచివాలయాల ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పారిశుధ్య కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న జీతాలు తక్కువేనని, వాటిని త్వరలో పెంచే విధంగా కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు ఎమ్మెల్యే రాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండి నూకాలమ్మ, ఉప సర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, పంచాయతీ ఈవో నారాయణ రావు, వార్డు సభ్యులు తానవరపు శ్రీనివాసరావు, కందర్ప శంకర్, ధనలక్ష్మి, ఓరుగంటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

'మిషన్ శక్తి'పై అవగాహన

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రాల వద్ద సోమవారం మిషన్ శక్తి పథకంపై మహిళలకు. బాలికలకు, మగవారికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరు రాజేష్, ఐసిడిఎస్ సూపర్వైజర్ జయలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు ఈశ్వరమ్మ, మంగ, వేణుసత్య, జగది, పరదేశమ్మ, సుబ్బలక్ష్మి, వెంకటలక్ష్మి, పాచినవానిపాలెం అంగన్వాడీ కార్యకర్త అప్పలనర్స, మహిళలు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఇజిఎస్ సామాజిక తనిఖీపై సమావేశం

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ వెలుగు కార్యాలయంలో సోమవారం ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందితో సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. 2023-2024లో వివిధ శాఖల నందు చేపట్టిన పనులపై తనిఖీలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిఒ గోవిందారావు, వసంత్, ఎంపీడీవో కీర్తి స్పందన, హౌసింగ్ ఎఇ రెడ్డి, సర్పంచ్‌లు గొర్లి గోపి అమ్ములు, కుండ్రాపు వరలక్ష్మి సీతారామయ్య, సుపరింటెండెంట్ రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ జాతీయ టెక్నికల్ కమిటీ ఛైర్మన్‌గా సత్యనారాయణ

ప్రజాశక్తి-అనకాపల్లి : అఖిల భారత టెన్ని కాయిట్ టెక్నికల్ కమిటీ ఛైర్మన్‌గా కెఎన్‌వి సత్యనారాయణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జాతీయ టెన్నికాయిట్ కార్యవర్గ సమైక్య సమావేశం సోమవారం ఢిల్లీలో నిర్వహించారు. ఆలిండియా టెన్నికాయిట్ టెక్నికల్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన కెఎన్‌వి సత్యనారాయణ నాలుగు సంవత్సరాలు అంటే 2024 నుండి 2028 వరకు ఈ పదవీలో కొనసాగుతారు. సత్యనారాయణ నియామకం పట్ల రాష్ట్ర టెన్నికాయిట్ అధ్యక్షులు వైడి రామారావు, ఛైర్మన్ పీజీవీఆర్ నాయుడు (గణబాబు), తవిటయ్య అభినందనలు తెలిపారు.



నియామకం పత్రం అందుకుంటున్న సత్యనారాయణ

విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని ఏబిఓ అర్జున అన్నారు. మండలంలో గల తురకలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా పర్యావరణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తమ తల్లి పేరుతో బంధువుల పేరుతో ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం ద్వారాగా పర్యావరణాన్ని కాపాడవచ్చుని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంజే రవీంద్రబాబు, వన సేవకులు ముత్యాలు, నాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న దృశ్యం

ప్రభుత్వరంగ సంస్థల వల్లే యువతకు ఉపాధి

● ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిష్టి



దీక్షల్లో పాల్గొన్న ఆవాజ్ నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వరంగ సంస్థలు ఉండటం వల్లే యువతకు ఉపాధి లభిస్తోందని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా చిష్టి అన్నారు. పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ సాధ్యమన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారమూ కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు పార్లమెంట్ సమావేశాల్లో ప్రకటించాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని ఇటీవల విశాఖకు వచ్చిన కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి, ఉక్కును కాపాడుకుంటామని సిఎం చంద్రబాబు చెబుతున్నా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఈ క్రమంలో ప్లాంట్‌ను అమ్మడం లేదని స్వయంగా ప్రధాని మోడీనే పార్లమెంట్‌లో ప్రకటన చేస్తే మంచిదని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఉక్కు కర్మాగార పరిరక్షణ పోరాటంలో ముస్లిం సోదరులు ఎల్లప్పుడూ భాగస్వాములవుతారన్నారు.

ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయడంతో పాటు పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని, వర్కింగ్ క్యాపిటల్ అందించాలని, ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్లా సుభాన్, విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్‌డి.అయూబ్, ఎ.అశ్రఫ్, రాష్ట్ర కమిటీ సభ్యులు అబ్దుల్ మున్నీర్ ముషాద్, కెయుజెడ్.ఖాన్, మౌలాలి, పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కో కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత


నక్కపల్లిలో యూనిఫాం అందజేస్తున్న ఎంపిటిసి నాగేశ్వరరావు

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం యూనిఫారం అందజేశారు. పెదతీనార్ల పాఠశాలలో విద్యార్థులకు ఎంపిటిసిసీ సభ్యులు మెరుగు నాగేశ్వరరావు యూనిఫారం అందజేశారు. హెచ్‌ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు ,కూటమి నాయకులు గోసల తాతారావు, పి దేవుడు, రాజు పాల్గొన్నారు. జానకయ్యపేటలో కూటమి నాయకులు కురందాసు నూకరాజు, కురందాసు అప్పలరాజు, దేవర సత్తిబాబు, దేవర రామకృష్ణ ,మొల్లి శ్రీను విద్యార్థులకు యూనిఫారం అందజేశారు.గొడిచెర్లలో మండల మాజీ ఉపాధ్యక్షుడు రమణ ,అల్లు రమణ విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు.

కోటవురట్ల: ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించి, నాణ్యమైన విద్యతోపాటు ప్రభుత్వం ఇస్తున్న సౌకర్యాలను సద్వినియోగించుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు జనార్ధన్ అన్నారు, సోమవారం పాములవాక జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు..

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో పలు గ్రామాల్లో సోమవారం పిహెచ్‌సి వైద్య సిబ్బంది దోమల నివారణ చర్యలు చేపట్టారు. కోటవురట్లలోని ప్రభుత్వ బాలికల వసతిగృహం, పందూరు, శివారు అల్లుముయ్యపాలెం గ్రామాలలో హెల్త్ అసిస్టెంట్ అప్పారావు ఆధ్వర్యంలో దోమల నివారణ మందులను పిచికారీ చేశారు. దోమల నివారణతోనే సీజనల్, ఇతరత్రా వ్యాధులు దరిచేరని, వాటినివారణకు ప్రజలు సహకరించి, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు, కార్యక్రమంలో ఎఎన్ఎం,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'మీ సేవ' నిర్వాహకుల సమావేశం


మీ సేవ కేంద్ర నిర్వాహకుల నూతన కార్యవర్గం

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : రాష్ట్రంలో మీ సేవా కేంద్రాలకు పూర్వ వైభవం రానుందని మీ సేవ నిర్వాహకుల అసోషియేషన్ గౌరవ అధ్యక్షులు ముత్తా గోవిందరావు అన్నారు. సోమవారం సాయంత్రం తిమ్మాపురం శివారు గోకులపాడు డాల్ఫిన్ దాబా వద్ద మండల యూనియన్ సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వ పాలనలో అయిదేళ్లు మీ సేవా నిర్వాహకులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో మీసేవ కేంద్రాలను బలోపేతం చేయాలని చూస్తోందని, అదే జరిగితే ఈ కేంద్రాలకు మళ్లీ మంచిరోజులు రావడం ఖాయమన్నారు

నూతన కార్యవర్గం ఎన్నిక

ఈ సందర్భంగా సంఘం జిల్లా కమిటీ సభ్యులు కర్రి జోగారావు నేతృత్వంలో గురజాడ మీసేవ అసోషియేషన్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కార్యవర్గం గౌరవాధ్యక్షుడిగా ముత్తా గోవిందరావు, అధ్యక్షుడిగా ఎవిఎస్ బాబు, ఉపాధ్యక్షుడిగా కర్రి భూపతిరావు, కార్యదర్శిగా భీమరశెట్టి శ్రీనువాస్, సహాయ కార్యదర్శిగా గొల్లపల్లి రాజు, ట్రెజరర్‌గా బొట్టా శేషగిరి, సభ్యులుగా శ్రీకాకోళపు జోగిబాబు, జాలుమూరి వాసు, నానేపల్లి బాబ్జీ, వీసం రామస్వామి, వాసుపల్లి మర్నియ్య, కోరిబిల్లి కృష్ణ, మడగల సత్యన్నారాయణ, దండు వెంకట అప్పలరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విలువలతో కూడిన విద్య అందించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డిడి రమణ

ప్రజాశక్తి -కోటవురట్ల: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌డివి రమణ అన్నారు సోమవారం మండలంలోని కస్తూరి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతోకాసేపు ముచ్చటించి విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సౌకర్యాలను అందించాలని, వాటిపట్ల నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. కార్యక్రమంలో జిసిడిఒ పద్మావతి, కస్తూర్బా విద్యాలయ ప్రత్యేక అధికారిని సరితా దేవి పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సోమవారం విశాఖ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 261 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 104 ఉండగా, జివిఎంసికి చెందినవి 77 ఉన్నాయి. అలాగే పోలీసు శాఖకు సంబంధించి 9, ఇతర విభాగాలకు సంబంధించి 71 వచ్చాయి.అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధ్ర ప్రసాద్, వాటి పరిష్కారానికి జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

జివిఎంసిలో 95 వినతులు

ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 95 వినతులు వచ్చాయి. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, అదనపు కమిషనర్ (డెవలప్‌మెంట్) కెఎస్.విశ్వనాథన్ వినతులు స్వీకరించారు.

ఘనంగా వరల్డ్ యూత్ స్కిల్స్ డే

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: : నగరంలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీలో ఉన్న స్కిల్ హబ్‌లో సోమవారం వరల్డ్ యూత్ స్కిల్స్ డేను నిర్వహించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖాధికారి సాయికృష్ణ చైతన్య మాట్లాడుతూ, దేశంలో 52 శాతం మంది విద్యార్థులు సరైన నైపుణ్యం లేక ఉద్యోగాలు సంపాదించలేక పోతున్నారన్నారు.. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ లాజిస్టిక్స్ అండ్ వేర్ హౌస్, బ్లాక్ చైన్, మిషన్ లేబొరేటరీ తదితర రంగాలలో అత్యధిక ఉద్యోగాశాలు వస్తాయని, దానికి అనుగుణంగా విద్యార్థులు తన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని తెలియజేశారు. స్కిల్ హబ్ స్టూడెంట్స్‌కు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ అదనపు అధికారి స్వప్న, నాన్ టెక్నికల్ ఆఫీసర్ కమలాకరరావు, హెచ్ఆర్‌డి ఎంఎఎస్ ఎగ్జిక్యూటివ్ కార్తీక్, హబ్ కోఆర్డినేటర్ లక్ష్మి పాల్గొన్నారు.

పశువులకు వ్యాక్సినేషన్


పశువులకు టీకాలు వేస్తున్న వెటర్నరీ సిబ్బంది

ప్రజాశక్తి - చీడికాడ : పశువులకు ముద్ద చర్మపు వ్యాధి టీకాలు వేసినట్లు గ్రామ సర్పంచ్ కోడూరు సత్యవతి అన్నారు చీడికాడ మండలం, జైతవరం గ్రామంలో ముద్ద చర్మపు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో పశువుల చర్మంపై పొక్కులు రూపంలో ముద్ద చర్మపువ్యాధి ప్రబలుతుందని అటువంటి వ్యాధి నివారణకు ముందస్తుగా పశువులకు ఈ టీకాలు వేయించాలని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఎంపిటిసి పైలా ముత్యాలనాయుడు, ఉప సర్పంచ్ ఈర్లి చైతన్య, పంచాయతీ కార్యదర్శి పట్నాల గోపి, కొల్లి నవీన్, విఆర్ఒ గౌరీశంకర్, పశు సంవర్ధక శాఖ సహాయకులు మూర్తి శ్రీనివాసులు, పాడి రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

అధ్వానంగా ఉపమాక పుష్కరిణి

- చెరువులో నిండా పేరుకుపోయిన నాచు
- చెత్తాచెదారం, వ్యర్థాలతో అస్తవ్యస్తం
- స్నానాలాచరించేందుకు భక్తుల అవస్థలు


చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిన పుష్కరిణి

ప్రజాశక్తి-నక్కపల్లి : మండలంలో ఉపమాక పుష్కరిణి పెరిగిన నాచు మొక్కలు, వ్యర్థాలతో అధ్వానంగా దర్శనమిస్తోంది .చెరువు నిండా నాచుమొక్కలుఉండడంతో భక్తులు స్నానాలు ఆచరించలేని పరిస్థితి నెలకొంది .కనీసం స్నాన ఘట్టాల వద్ద కూడా కాలు పెట్టలేని పరిస్థితి నెలకొంది .

ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వేంకటేశ్వరస్వామి వారి బంధర సరస్సు అంటే ఒక పవిత్రమైన పుష్కరిణి. పుష్కరిణిలో కాళ్లు కడుక్కుని, నెత్తిపై కొన్ని జలాలు జల్లుకుంటే సకల పాపాలు హరిస్తాయని, పుణ్యం వస్తుందని భక్తుల విశ్వాసం. గతంలో పుష్కరిణి చాలా ఆహ్లాదకరంగా దర్శనమిచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించలేదు. గత ఏడాది పుష్కరిణి నిండా నాచు మొక్కలు, గడ్డి, ఇతర వ్యర్థాలు, ప్లాస్టిక్, చెత్త గుడ్డలతో నిండి, నీరంతా కలుషితమై దుర్వాసన రావడంతో టిటిడి అధికారులు స్పందించి, చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గత ఏడాది మే ,జూన్ నెలలో చెరువులో కలుషితమైన నీటిని, వ్యర్థాలు, బురదను తొలగింపు చర్యలు చేపట్టారు. వర్షాలకు చెరువులో నీరు చేరడంతో మరలా నాచు మొక్కలు విపరీతంగా పెరిగాయి .దీనికి తోడు చెరువు బురదమయంగా మారింది. స్నాన ఘట్టాల వద్ద కూడా నాచు పెరిగి, బురద మయంగా ఉండడంతో భక్తులు , గ్రామస్తులు టిటిడీ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల్లో చాలా మంది భక్తులు పుష్కరిణిలో స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకుంటారు. చెరువు అధ్వానంగా ఉండటం వలన భక్తులు స్నానాలు ఆచరించడానికి నానా అవస్థలు పడుతున్నారు. గ్రామస్తులు కూడా చెరువులో స్నానాలు ఆచరిస్తూ ఉంటారు. చెరువు అపరిశుభ్రంగా ఉండడంతో స్నానాలు చేసేందుకు సాహసించడం లేదు. .ఇప్పటికైనా టిటిడి అధికారులు స్పందించి చెరువులో నాచు మొక్కలు, వ్యర్థాలను తొలగింపుకు చర్యలు చేపట్టాలని భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు .చెరువులో నాచుముక్కలు శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, స్నాన ఘట్టాల వద్ద ఉన్న బురదను తొలగించి, పుష్కరిణి పరిశుభ్రంగా ఉండే విధంగా, , ఆహ్లాదకరంగా తయారుచేయాలని టిటిడి అధికారులకు గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. పుష్కరిణిలో స్నానం చేస్తే పుణ్యం వస్తుందనే భక్తుల నమ్మకానికి అనుగుణంగా దీన్ని తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- పిహెచ్‌సిని డిఐఒ చంద్రశేఖర్ ఆకస్మిక తనిఖీ
- సిబ్బందికి కౌన్సెలింగ్, సేవలపై స్పష్టమైన ఆదేశాలు
- స్టాఫ్‌నర్స్‌కు షోకాజ్ నోటీసు జారీ
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన



పిహెచ్‌సిలో వైద్యసేవలపై డాక్టర్లు,సిబ్బందిని ప్రశ్నిస్తున్న డిఐఒ చంద్రశేఖర్

ప్రజాశక్తి - చీడికాడ: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని డిఐఒ చంద్రశేఖర్ హెచ్చరించారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించడంతోపాటు రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. చీడికాడ మండల కేంద్రంలోని వైద్యసిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల రోగులు పడుతున్న ఇబ్బందులు, సిబ్బంది ఇష్టానుసారంగా వచ్చిపోతుండడంపై రోగుల ఆవేదనను ' వైద్యసిబ్బంది విధులకు డుమ్మా' శీర్సకతో ప్రజాశక్తి దినపత్రిక వెలుగులోకి తేగా, ఈ కథనానికి స్పందించిన డిఐఒ చంద్రశేఖర్ సోమవారం ఆస్పత్రిని తనిఖీ చేశారు. రోగులకు అందించాల్సిన వైద్యసేవలు, విధుల పట్ల బాధ్యత, సమయ పాలన వంటి అంశాలపై ఆసుపత్రి సిబ్బందికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎవరైనా బాధ్యతలను విస్మరించే చర్యలు తప్పవని హెచ్చరించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన స్టాఫ్ నర్స్‌కు షోకాజ్ నోటీసు జారీ చేస్తున్నామని, పనితీరు మెరుగుపరచుకోకపోతే చర్యలు తప్పవన్నారు. ప్రస్తుతం వర్షాల సీజన్ కావడంతో జ్వరాలు, వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యసిబ్బంది మరింత అప్రమత్తంగా, అందుబాటులో ఉండి సేవలను అందించాలని సూచించారు.కార్యక్రమంలో వైద్యాధికారులు సునీల్ కుమార్, శ్రీనివాస్, ఎస్ఒ రామచంద్రరావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

పేదల భూములకు నష్టపరిహారమివ్వాలని ధర్నా




ఆందోళన చేస్తున్న సాగుదారులు, సిపిఎం నేతలు

ప్రజాశక్తి నక్కపల్లి :మండలంలోని డిఎల్ పురంలో పేదలు సాగులో ఉన్న భూములకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు ,మాజీ ఎంపిటిసి సభ్యులు గింజలవెంకటరమణ డిమాండ్ చేశారు. సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద పేద నిర్వాసితులతో కలిసి, సో నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు .అనంతరం కలెక్టర్ విజయ కృష్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో ప్రభుత్వం డిఎల్‌పురంలో సర్వే నంబర్ 85లో 110 ఎకరాలు 150 పేదలు సాగు చేసుకుంటున్న భూములను సేకరిస్తున్నారని తెలిపారు.

సాగుదారులైన పేదలకు ఈ భూములు తప్ప వేరొక ఆధారం లేదని, 2013 భూసేకరణ చట్టాన్ని పరిగణనలోకి తీసుకుని పేద సాగుదార్లుకు జిరాయితీతో సమానంగా నష్టపరిహారం, ప్యాకేజీ ఇవ్వాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చేపలు పరదేశి, వాసపల్లి బాబ్జీ,కిల్లాడి వరహాలు, ఏడిద చిలకమ్మ, గింజాల సింహాద్రి, సిరిపల్లి జగమణి, చేపల రాజు, గరిగిన అమ్మాజీ పాల్గొన్నారు.

జాబ్‌మేళా నిర్వహించండి



ప్రిన్సిపల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నేత గీతాకృష్ణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : డిగ్రీ, పీజీ పూర్తయిన విద్యార్థులకు జాబ్ డ్రైవ్ తీసి ఉద్యోగాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జీ.గీతాకృష్ణ కోరారు. సోమవారం నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం గీతాకృష్ణ మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గంలో డిగ్రీ, పీజీ చదువుకున్న వారు ఎంతో మంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారన్నారు. వారికి ఆయా కంపెనీల ద్వారా జాబ్ డ్రైవ్ నిర్వహించి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ పైల రాజు పాల్గొన్నారు.

ఎస్ఇబిఎస్ఎ రాష్ట్ర అధ్యక్షునిగా శివనారాయణరాజు



శివనారాయణరాజు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన కే.శివనారాయణరాజు నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షులు కె.రామకృష్ణ, హ్యూమన్ రైట్స్ సెల్ అధ్యక్షులు కోనా మంగయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శివనారాయణరాజు మాట్లాడుతూ ఎస్ఇబిఎస్ఎ సంస్థ భారత ప్రభుత్వ నీతి అయోగ్‌కు అనుబంధ సంస్థ అన్నారు. ఈ సంస్థ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జిల్లాల వారీగా కమిటీల సమావేశం నిర్వహించి సంస్థ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

వృద్ధులు, వికలాంగులకు ఉపకరణాలు

ప్రజాశక్తి -కోటవురట్ల: వృద్ధులు, వికలాంగులు జీవన విధానం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ ప్రశాంతి అన్నారు సోమవారం వెంకటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఫ్లోరోసిస్ రిహాబిటేషన్ పరికరాలు పంపిణీ చేశారు, గతంలో వీరికి వీల్‌చైర్లు అందజేయగా సోమవారం వాకింగ్ స్టిక్స్, నెక్ బ్యాండ్, వాకర్స్, లాంబర్ బెల్ట్స్ అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వికలాంగులు జీవన విధానం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు కార్యక్రమంలో డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ ప్రశాంత్, ఆరోగ్య విస్తరణ అధికారి గోవిందరావు పాల్గొన్నారు.



ఉపకరణాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ ప్రశాంతి

22న దేవాలయ భూములు కౌలుకు వేలం

ప్రజాశక్తి- గొలుగొండ: మండలంలో పాత మల్లంపేట పంచాయతీలోని దార మల్లేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో ఉన్న భూములను కౌలుకు ఇచ్చేందుకు ఈనెల 22వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లుగా దేవస్థాన కార్యనిర్వాహణ అధికారిని దివ్యతేజ తెలిపారు. దారపాలెం రెవెన్యూ పరిధిలో ఉన్న 741 సర్వే నెంబరులో 1.82 ఎకరాల భూమికి 2024 నుండి 2027 మూడు సంవత్సరాల పాటు కౌలుకు పాతమల్లంపేట సచివాలయం వద్ద ఈ వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు. వేలంపాటలో పాల్గొనే రైతులు రూ. ఐదువేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొవాలన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఈనెల 22వ తేదీన పాత మల్లంపేట సచివాలయం వద్దకు హాజరుకావాలని ఆమె కోరారు.

ఇసుక అక్రమ నిల్వపై నిగ్గు తేల్చండి

- అప్పటివరకు 'గబ్బాడ' పాయింట్ నుంచి తరలించొద్దు
- అధికారులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశం



గబ్బాడ ఇసుక డిపో వద్ద అధికారులతో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : అనకాపల్లి జిల్లాలో ఉచిత ఇసుక సరఫరాకు గుర్తించిన రెండు పాయింట్లలో ఒకటైన గబ్బాడలో 63వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉందని, అది ఎవరు తెచ్చారో, ఎక్కడి నుంచి తెచ్చారో వ్యవహారం తేలేంతవరకు ఇక్కడ నుంచి తరలింపును నిలుపుదల చేయాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశించారు.. సోమవారం ఆర్‌డిఒ జయరాంతో కలిసి గబ్బాడ ఇసుక పాయింట్‌ను సందర్శించారు. అక్కడున్న ఇసుక నిల్వలు ఎవరు తెచ్చారని అధికారులను ప్రశ్నించగా, స్పష్టమైన సమాధానం రాకపోవడంతో, అక్రమ ఇసుకగా గుర్తించాలని, దీనిపై విచారణ జరిపి బాధ్యులెవరో తేల్చాలని కోరారు. ఇసుకను తరలించిన వారిపై కేసు నమోదు చేయాలన్నారు. దీనిపై గనులశాఖ రాష్ట్ర ఎండీతో అక్కడి నుంచే ఫోనులో మాట్లాడి, తగు చర్యలకు ఆదేశించారు.

అన్న క్యాంటీన్ పనుల పరిశీలన

మున్సిపాలిటీలో పరిధిలోని అన్న క్యాంటీన్ పనులను శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సోమవారం పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చేనెల 15న అన్నాక్యాంటీన్లను పునరుద్ధరించనున్నప్పటికీ, నర్సీపటంలో నాలుగురోజులు ముందుగానే ప్రారంభిస్తామని, దానికి అనుగుణంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఆకలిని తీర్చే అన్నాక్యాంటీన్లను మూసేసే దుర్మార్గపు చర్యకు పూనుకుందని, అందుకు తగిన శాస్తి ప్రజలు చెప్పారని మండిపడ్డారు.

కల్యాణమండపం నిర్మాణం పూర్తికి చర్యలు

మున్సిపాలిటీ పరిధిలోని బలిఘట్టం సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద అసంపూర్తి కల్యాణ మండపం నిర్మాణ పనులపై అధికారులతో స్పీకర్ అయ్యన్న సమీక్షించారు. ఇప్పటికే ా 60 శాతం పనులు పూర్తయ్యాయని, మిగతా 40 శాతం పనులను త్వరగా పూర్తిచేసేందుకు అవసరమైన అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పిఆర్ ఇఇ విఎస్.నగేష్‌బాబు, డిఇఇ ఈశ్వరరావు, ఎఇఇ నర్సింగరావులను అదేశించారు.

గ్రంథాలయ భవనాలు నిర్మించండి



స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

నర్సీపట్నం టౌన్ : విశాఖపట్నంలో జిల్లా గ్రంథాలయ సంస్థ, జిల్లా కేంద్ర గ్రంథాలయం భవనాల నిర్మాణం చేపట్టాలని పౌర గ్రంథాలయ సేవా సమితి ప్రతినిధులు, విశ్రాంత గ్రంథపాలకులు కె.త్రిమూర్తులు, జి.మురళీకృష్ణ కోరారు. సోమవారం నర్సీపట్నంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును మర్యాదపూర్వకంగా కలిసి, వినతిపత్రం సమర్పించారు, దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి, సంబంధిత మంత్రి లోకేష్‌తో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు.

ఈ సందర్భంగా విశాఖపట్నం మహారాణిపేటలో జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన రూ. 100 కోట్ల విలువచేసే ఎకరం స్థలాన్ని గత ప్రభుత్వహయాంలో బడా రాజకీయ నాయకులే అధికారికంగా కబ్జాకు పాల్పడితే పోరాడి అడ్డుకున్నామని, దాన్ని జోలికి ఇంకెవరూ రాకుండా ఉండాలంటే భవనాల నిర్మాణం చేపట్టాలని, తద్వారా చదువరులకు, పోటీ పరీక్షార్థులకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుందని స్పీకర్‌కు విన్నవించారు